క్లుప్తంగా

అంగన్‌వాడీ సెంటర్ కోసం వినతి

కొండాపురం : మండలంలోని కె.బొమ్మేపల్లె దొరువుపల్లెలోని అంగన్‌వాడీ సెంటర్‌ను జమ్మలమడుగు మండలంలోని పొన్నతోటలో నిర్వహిస్తున్నారని తమ గ్రామంలోనే అంగన్‌వాడీ కేంద్రంను నిర్వహించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం ముద్దనూరు ఐసీడీఎస్ సీడీపీవో ముంతాజ్ బేగం కె.సుగుమంచిపల్లె ఆర్అండ్ఆర్ సీ బ్లాక్‌లో నిర్వహించిన సమావేశంలో గ్రామ ప్రజలు ఆమె దృష్టికి తీసికెళ్లారు. స్పందించిన ఆమె మాట్లాడుతూ గండికోట జలాశయం పరిధిలో కె.బొమ్మేపల్లె ముంపు జాబితాలో చేరడంతో పొన్నపుతోటలోని పునరావాసకాలనీలోనే అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలను అప్పట్లో నిర్మించారన్నారు. ఇక్కడ మిని అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్తామన్నారు.

నర్సింగ్ హోంల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ

జమ్మలమడుగు : పట్టణంలోని సాయిభరద్వాజ్, తాతిరెడ్డి నర్సింగ్ హోంలను శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తనిఖీ చేసి మాట్లాడారు. చట్ట రీత్యా లింగ నిర్ధారణ చేయడం నేరమన్నారు. వైద్య వృత్తిలో ఉంటూ లింగ నిర్ధారణ చేసి వృత్తికి అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆడపిల్లల నిష్పత్తి పెంచవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లింగనిర్ధారణ చేసినట్లు రుజువు అవుతే వైద్యుల సర్టిఫికేట్లను రద్దు చేస్తామన్నారు.

పొలతలలో కార్తీక మాసం ఉత్సవాలపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ కృష్ణానాయక్

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో నవంబర్ నెల 4వ తేదీ నుంచి నిర్వహించే కార్తీక మాసం ఉత్సవాలపై శుక్రవారం ఆలయ ఈఓ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రంకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ చల్లని దొర, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ రహంతుల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజీబ్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి అండగా ఉంటాం


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : మృతి చెందిన రైతు వెంకటనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన వెంకటనారాయణ మృతదేహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని ప్రజలందరు మున్సిపల్ ఇంటి, నీటి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని, మార్చి నాటికి సుమారు రూ.3 కోట్లు దాక పన్నులను వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇప్పటి వరకు సుమారు రూ.1 కోటి వసూళ్లు అయ్యాయని, ఇంకా రూ.3 కోట్ల దాక బకాయిలు వసూళ్లు కావాల్సిఉందన్నారు. ఇందులో సుమారు రూ.1 కోటి ఐఎల్ పన్నులు ఉన్నాయని వీటిని రద్దు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. పన్నులు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మార్చి నాటికి పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

పరామర్శ

కమలాపురం : మండలంలోని మొలకవారిపల్లెకు చెందిన రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. గురువారం రవిశంకర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం రిమ్స్‌లోని మార్చురి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సీకేదిన్నె మండలం ఉరుటూరుకు చెందిన సిద్ధారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. హార్టికల్చర్ మాజీ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

• వెలగని లైట్లు



పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వారం రోజులుగా ఐమాక్స్ లైట్లు వెలగక అంధకారంలో ఉంది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కోట్లాది రూపాయలతో రహదారి మధ్య లైట్లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే నాలుగు రోడ్ల కూడలిలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. కానీ ఈ ఐమాక్స్ లైట్లు గత వారం రోజులుగా వెలగలేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి పూట రోడ్డుంతా చీకటితో నిండిపోతోందన్నారు. దీంతో చోరీలకు అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు. వారం రోజులుగా వెలగని లైట్లపై స్థానిక మున్సిపల్ అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పటికైన అధికారులు స్పందించాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు. పన్నుల వసూళ్లపై ఉన్న దృష్టి వీటిపై లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

– ఎర్రగుంట్ల

• అడుగులోతు నీరు



నాలుగు చినుకులు రాలితే.. ఆ రహదారిపై అడుగులోతు నీరు నిలబడాల్సిందే. జమ్మలమడుగు–తాడిపత్రి ప్రధాన రహదారిపై వద్దిరాల నాలుగు రోడ్ల కూడలి వద్ద ఈ దృశ్యం దర్శనం ఇస్తుంది. ఆ పల్లె వాసులు ఊరిలో నుంచే రోడ్డుపైకి రావాలంటే ఈ బురద నీటిలో నడవాల్సిందే. ఒక సారి వర్షం కురిస్తే వారం రోజుల వరకు వర్షపు నీరు ఇక్కడే నిలబడి మురికిగా మారి అపరిశుభ్రతకు నిలయంగా మారుతుంది. సంబంధిత అధికారులు సైతం నిత్యం ఈ రహదారిపైనే ప్రయాణిస్తున్నప్పటికీ తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తూ వెళుతుంటారని స్థానికులు వాపోతున్నారు.

– మైలవరం

కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.నారాయణరెడ్డి, కళాశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

అమరవీరుడికి నివాళి

ముద్దనూరు : అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అమరవీరుడు శ్యాముల్‌కు నివాళులర్పించారు. ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ శ్యాముల్ విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ సందర్భంగా కడప 11వ బెటాలియన్ సీఐ వెంకటరమణ, స్థానిక సీఐ దస్తగిరి, ఏఎస్ఐ శ్రీనివాసులు శ్యాముల్ కుటుంబ సభ్యులను సత్కరించారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి


మెప్మా స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కమలాపురం : ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. స్థానిక డీసీసీ బ్యాంక్ ఆవరణంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్ట్ (స్టాల్)ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకర్లు మెప్మా సభ్యులకు అందించే రుణాల మొత్తాన్ని పెంచి అందించాలన్నారు. డ్వాక్రా మహిళలు సొంతంగా వివిధ రకాల పౌష్టికాహారంతో తయారు చేసిన పిండి వంటలను ప్రజలు కొనుగోలు చేస్తే మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధిస్తారన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ పగడాల జగన్నాథ్, మెప్మా పట్టణ మిషన్ సమన్వయకర్తలు, వెలుగు ఏపీఎం గంగాధర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

వేంపల్లె : సైబర్ నేరాలపట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల ఆవరణంలో పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఎస్ఐ హాజరై మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో యువత ప్రాముఖ్యత, వారి పాత్ర గుర్తించడం ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విద్యార్థులు తమ రచనల ద్వారా సైబర్ భద్రత, నేరాల నివారణకు సంబంధించిన తమ ఆలోచనలను తెలియజేయలన్నారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి


మాట్లాడుతున్న డీఎంపీయూ శశిభూషణ్‌రెడ్డి

వేంపల్లె : గర్భిణుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని డీపీఎంయూ శశిభూషణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 వారాల్లోనే గర్భిణుల వివరాలు ప్రభుత్వ ఆరోగ్య వెబ్‌సైట్‌లో లింకు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ స్వాతిసాయి, డాక్టర్ లక్ష్మీప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ వున్నీసా బేగం, సీహెచ్ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ బాబాఫక్రుద్దీన్, హెల్త్ సూపర్‌వైజర్ అరుణాదేవి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే డెంగీ జ్వరాల నివారణ


జ్వరం వచ్చిన బాలుడితో మాట్లాడుతన్న డీఎంహెచ్ఓ

ముద్దనూరు : ఈ ఏడాది ఏప్రిల్ నెలనుంచి ఇప్పటి వరకు జిల్లాలో 35 డెంగీ కేసులను గుర్తించి చికిత్స అందించామని, అప్రమత్తతోనే డెంగీ జ్వరాలను నివారించవచ్చని జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి ఉమామహేశ్వరారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక 6వ వార్డులో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి మాట్లాడారు. అపరిశుభ్రత వాతావరణం, పారిశుద్ధ్య లోపం వున్న ప్రాంతాలలో దోమల వ్యాప్తి చెందకుండా సంబంధిత అధికారులతో కలసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక 6వ వార్డులో 7 మందికి డెంగీ లక్షణాలు వున్నట్లు గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడా డెంగీ మరణాలు సంభవించలేదన్నారు. అనంతరం జ్వరాలబారిన పడి చికిత్స పొందుతున్న కుటుంబాలను సందర్శించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు లక్షుమయ్య, ప్రసాద్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్షలు చేయించాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. పై వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9703622831, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు


అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయి సిబ్బంది

వేముల : ప్రకృతి వ్యవసాయం ద్వారా అంతర పంటలలో అధిక లాభాలు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ గ్రామ యూనిట్ ఇన్‌చార్జి రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం వేములలో అంతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. అంతర పంటలు సాగు చేయడంవల్ల ఒక పంటలో గిట్టుబాటు ధర లేకపోయినా మరొక పంట ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునన్నారు. అలాగే గ్రేడ్ మోడల్ ద్వారా అంతర పంటలు, కూరగాయలు మోడల్‌లో రసం పీల్చే పురుగులైన తెల్ల దోమ, పచ్చ దోమల నివారణకు పసుపు, బులుగు, జిగురు అట్టలు పెట్టడం జరిగిందని.. లింగాకర్షక బుట్టలు పెట్టడంవల్ల రసం పీల్చే పురుగులను నివారించుకోవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేష్, రాజీవ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మనందరి బాధ్యత

పులివెందుల రూరల్ : స్థానిక ఎర్రగుడిపల్లెలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వేని శుక్రవారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య నిర్వహించారు. నిల్వ ఉన్న నీటిలో అబెట్ పిచికారీ చేసి ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్యతను పెంపొందించుకోవాలి


కారు మోడల్ డిజైన్, పనితీరు గురించి వివరిస్తున్న ట్రైనర్ రాహుల్ రంజన్

పులివెందుల రూరల్ : విద్యార్థులు శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని నైపుణ్యతను పెంపొందించుకోవాలని జెఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ అరుణకాంతి తెలిపారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో మెకానికల్ విభాగాధిపతి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో యంత్ర 2కె24 జాతీయ సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంకే ఇండస్ట్రీస్ టెక్నికల్ ట్రైనర్ రాహుల్ రంజన్ ఎఫ్3 కారు డిజైన్, వాటి పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల అభివృద్ధి అధికారి కిరణ్‌మోహన్‌రావు శుక్రవారం రామనపల్లి పంచాయతీ పరిధిలోని జెడ్పీ హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌తో స్కూలు పిల్లలతో కలిసి భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది రిజిష్టర్లు, హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి పలు అంశాలపైన తగు సూచనలు ఇచ్చారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సందర్శించి, రామనపల్లి గ్రామంలో పరిశుభ్రత పైన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు ఇచ్చారు. రామనపల్లి సచివాలయ సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర కల్పిస్తాం

వేంపల్లె : వరి పండించిన రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని వ్యవసాయ కార్యాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. మండలంలో వరిపంట కోసిన రైతుల ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పిస్తుందన్నారు. అలాగే ఇడుపులపాయలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రైతుల వరి పొలాలకు వెళ్లి రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పులివెందుల సహాయ వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ముద్దనూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో ముకుందరెడ్డి తెలిపారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్ ఊసేలేదు

పులివెందుల రూరల్ : రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదా అమలు, కడప స్టీల్ ప్లాంట్‌పై ఊసే లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రత్యేక హోదా గురించి మాట్లాడక పోవడం దురదృష్టకరమన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేకహోదా అమలుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ ముసలయ్య మృతి


ముసలయ్య(ఫైల్)

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ హనుమనుగుత్తి ముసలయ్య(70) అనారోగ్యంతో కడపలోని ఓ ఆసుపత్రిలో మృతి చెందాడు. 2013 నుంచి 2019 వరకూ ముసలయ్య చైర్మన్‌గా పనిచేశాడు.

పశుగణన ప్రారంభం

ముద్దనూరు : ప్రతి 5 సంవత్సరాలకొకసారి నిర్వహించే పశుగణన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈనెల 28వ తేదీ వరకు ఇంటింటికి వెళ్ళి పశుగణన చేయనున్నట్లు, ఆవుజాతి, గేదె, గొర్రె, మేక, కోళ్ళజాతుల గణన చేపట్టనున్నట్లు పశువైద్యాధికారి శ్రీనివాస తెలిపారు. మండలంలోని కొత్తపల్లెలో పశుగణన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిబ్బంది పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33/11కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి బొగ్గుడుపల్లె సొసైటీ ఎదురుగా ఉన్న వీధి, మున్సిపల్ ఆఫీస్ వెనుక వైపు వీధులలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థినికి అభినందన


ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ కుమారగుప్తా స్వామి

వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యాభ్యాసం చేస్తున్న ఈ–1 సీఎస్ఇ విద్యార్థిని సువర్ణను డైరెక్టర్ కుమారస్వామి గుప్తా అభినందించారు. ఈనెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గోవాలో జరిగిన 33వ నేషనల్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్‌లో సువర్ణ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. శుక్రవారం స్థానిక ఇడుపుపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ క్యాంపస్‌లో విద్యార్థి సువర్ణను శుక్రవారం యూనివర్సిటీ అధికారులు అభినందించారు. పవర్ లిఫ్టింగ్ కోచ్ మేనేజర్ డాక్టర్ తివారీ, పిడి ఓబయ్య, సుధాకర్ రెడ్డిలను ఆయన అభినందించారు.

పశుగణన సర్వేకు పాడి రైతులు సహకరించండి


సర్వే పోస్టరును ఆవిష్కరిస్తున్న కమిషనర్ శేషఫణి, వెటర్నీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మునెయ్య

ఎర్రగుంట్ల : ఇంటింటి పశుగణన సర్వే చేపడుతున్న పశుసంవర్ధశాఖ సిబ్బందికి పాడి రైతులు సహకరించాలని ఎర్రగుంట్ల పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మునెయ్య తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శేషఫణి చేతుల మీదుగా 21వ అఖిల భారత పశుగణన సర్వే పోస్టర్లను ఆవిష్కరించారు. మండలంలో 22 వేల ఇళ్లకుగాను 7 మంది ఎన్యూమరేటర్లు, ముగ్గురు సూపర్‌వైజర్లు సర్వే చేస్తున్నారన్నారు. శిక్షణ తీసుకున్న వారు ఇంటింటికి తిరిగి పశుగణన సర్వే చేసి యాప్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ సర్వే పూర్తి అయిన వెంటనే ఇంటికి సర్వే స్టిక్కర్ అతికిస్తారన్నారు. కార్యక్రమంలో వీఎన్‌పల్లి వెటర్నీ డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పంచాయతీలుగా అభివృద్ధి చేస్తాం

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలంలోని పెద్దకాంపల్లి గ్రామ సచివాలయంలో పవర్ గ్రిడ్ సంస్థ అధికారులు విజిలెన్స్ వార్షికోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పవర్ గ్రిడ్ డీజీఎం హరివెంకటకుమార్ మాట్లాడుతూ దేశ సమగ్ర అభివద్ధి కొరకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే ఇప్పపెంట, పెద్దకాంపల్లి పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దుతామని, స్థానిక పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా మారుస్తామని, ఇందుకు పవర్ గ్రిడ్ సంస్థ సహాయాన్ని కూడా తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కులాయిబాబు, పవర్ గ్రిడ్ అధికారులు, ఈఓఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు


రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

పులివెందుల రూరల్ : ప్రమాదాల నివారణకు ప్రధాన రహదారుల్లో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ హాజీవలి తెలిపారు. శుక్రవారం కడప రోడ్డులోని వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద పోలీసులు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు రేడియం స్టిక్కర్లను అమర్చామన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి

కమలాపురం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ చాలా కాన్ఫిడెంట్‌గా ఉండాలని, తప్పు చేయకపోతే ఎవరికి భయపడవద్దని, కోర్సులోని సబ్జెక్టులతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వే ఆఫ్ టాకింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం, జనరల్ అవేర్‌నెస్ కలిగి ఉండాలన్నారు. మీ కోర్సు పూర్తి కాక మునుపే జాబ్ మేళాలు నిర్వహించి మీకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మీ చదువు పూర్తి కాగానే కొప్పర్తి ఇండస్ట్రియల్‌లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కడప–బెంగళూరు రైల్వే లైన్ పూర్తి అయితే మరిన్ని కంపెనీలు వస్తాయని, అపుడు మరిన్ని ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి నెల జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, కోర్సును బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ రోజు మూడు కంపెనీలు వచ్చాయని, 75 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నాయని, అయితే 36 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు రాగా 20 మందిని ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోదెల ద్వారా విత్తనాలు నాటుకుంటే అధిక దిగుబడులు


మిన్నయ్యగారిపల్లె వద్ద ఉల్లి రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

పెండ్లిమర్రి : ఉల్లి పంట సాగుచేసే రైతులు విత్తన శుద్ధి తప్పని సరిగా చేసి బోదెల ద్వారా విత్తనాలు నాటుకున్నట్లు అయితే అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని మిన్నయ్యగారి పల్లె, బాలయ్యగారిపల్లె, గుర్రాలచింతపల్లె గ్రామ పొలాల్లో ఉల్లి పండించే రైతులతో ఆయన మాట్లాడారు. బోదెల పద్ధతితో ఉల్లి పంట సాగు చేస్తే ఉల్లి గడ్డలు నాణ్యతతో పాటు సైజు పెరిగి అధిక దిగుబడి వస్తోందన్నారు. ఎకరాకు ఎన్ని క్వింటాళ్ల పండించారని రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎకరాకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది, క్వింటాళ్ల రూ.3వేల నుంచి రూ.3500 ధర పలుకుతోందని ఈఏడాది ధరలు నిలకడంగా ఉండటంతో మంచి లాభాలు వచ్చాయని రైతులు సంతోషంగా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


యూసీఐఎల్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేముల : మండలంలోని తుమ్మలపల్లె గ్రామ సమీపంలో ఉన్న యూనియన్ ప్రాజెక్టు ఎస్ఎంఎస్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఖలీల్ సొదాగర్ మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా కార్మికులకు బీపీ, షుగర్‌లతో పాటు అన్ని రకాల జబ్బులకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. కార్మికులు కూడా తప్పనిసరిగా తమ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ రక్తపరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ విద్యుత్ శాఖ వారి విజ్ఞప్తి

లింగాల : వ్యవసాయ పొలాలలో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మె భూమి నుంచి నాలుగు అడుగుల ఎత్తులోపు ఉండటం గమనించామని విద్యుత్ శాఖ డిపార్ట్‌మెంట్ నియమ నిబంధనల ప్రకారం ఐదున్నర అడుగుల నుంచి ఆరు అడుగులు భూమికి ఎత్తులో ఉండాలని విద్యుత్ ఏఈ బాల సంజీవులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటంవల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులందరూ ఎవరికి వారే ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మె భూమి నుంచి ఐదున్నర నుంచి ఆరు అడుగుల ఎత్తు ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

పెండ్లిమర్రి : మండలంలోని మాచునూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలవీరారెడ్డిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. బాలవీరారెడ్డి ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చెయించుకుని ఇంటి వద్ద విశాంత్రి పొందుతున్నాడు.

జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనతో ఉన్నారు.